

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - ఏలూరు

ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ శుక్రవారం స్థానిక బాలయోగి సైన్స్ పార్కు వద్ద ఉన్న అశోక్‌నగర్ స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. విద్యుత్ వినియోగదారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరమ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి.జనార్దనరావు, ఆర్థిక సభ్యులు ఎం.శ్రీనివాస్, స్వతంత్ర సభ్యులు డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్ పాల్గొంటారని కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరమ్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రచారం మెండు.. సాయం అరకొర..!

- మళ్లీ పెరుగుతున్న గోదావరి ఉధృతి
- భద్రాచలం వద్ద 49 అడుగులకు చేరిన నీటిమట్టం
- వరద బాధితుల కష్టాలు వర్ణనాతీతం
- కొండపైకి చేరిన రుద్రంకోట గ్రామస్తుల పట్ల నిర్లక్ష్యం
- బియ్యం, నిత్యావసరాలు, కొవ్వొత్తులు, జనరేటర్ ఏఒక్కటీ ఇవ్వని దుస్థితి
- టార్పలిన్లు చిన్నవి ఇవ్వడంతో గుడారాలకు సరిపోని వైనం



కొండపై ఉన్న రుద్రంకోట గ్రామస్తులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి వరద బాధితుల పట్ల అధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి ఏమాత్రం సంబంధం లేకుండాపోయింది. బియ్యం, నిత్యావసర వస్తువులు, పాలు, కొవ్వొత్తులు, మస్కిటోక్వాయిల్స్ ఏఒక్కటీ సరిగ్గా అందని దుస్థితి నెలకొంది. అక్కడక్కడా కొద్దిమందికి ఇచ్చి వరద బాధితులందరికీ ఇచ్చినట్లు ప్రకటనలు గుప్పిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. కొండపైకి వెళ్లిన వారికి జనరేటర్లు ఏర్పాటు చేయకపోవడంతో సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టుకోవడానికి సైతం మళ్లీ గ్రామంలోకే రావాల్సిన పరిస్థితి నెలకొంది. రుద్రంకోట గ్రామస్తులు పడుతున్న అవస్థలే అందుకు నిదర్శనం. వరద ఉధృతి భయపడి వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామానికి చెందిన దాదాపు 80 కుటుంబాలు కొండపైకి వెళ్లి గుడారాలు వేసుకున్నారు. వరద ఉధృతి మళ్లీ పెరుగుతుండటంతో మరికొన్ని కుటుంబాలు కొండపైకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. వీళ్లకు ఇప్పటి వరకూ బియ్యం, కొవ్వొత్తులు, మస్కిటోక్వాయిల్స్, పాలు, నిత్యావసర వస్తువులు వంటివి ఏఒక్కటీ అందించలేదు. కూరగాయలు అందించినా అవి మూడొంతులు కుళ్లిపోయినట్లు బాధితులు చెబుతున్నారు. గత వరదలకు రుద్రంకోట ప్రజలు ఉన్న కొండపై రెండు జనరేటర్లు ఏర్పాటు చేశారు. 12 జనరేటర్లు అందుబాటులో ఉంచినట్లు చెబుతున్నా రుద్రంకోట గ్రామస్తులు ఉన్న కొండపై ఇప్పటికీ జనరేటర్ ఏర్పాటు చేయని పరిస్థితి ఉంది. కొండలపై గుడారాలు వేసుకునే వారికి ఇచ్చిన టార్పలిన్లు సైతం చాలీచాలనివి ఇవ్వడంపై బాధితులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గత వరదలకు 24-36 సైజుగల టార్పలిన్లు ఇస్తే ఈసారి 18-24 సైజుగల టార్పలిన్లు ఇచ్చారు. దీంతో గుడారాలు వేసుకునేందుకు సరిపోవడం లేదని బాధితులు చెబుతున్నారు. రెండు లాంచీలపై బియ్యం, నిత్యావసర వస్తువులు చేరవేసి వరద బాధితులందరికీ సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. దాచారం కాలనీలోని రాపాకగొమ్మి ప్రజల సమస్యలపై మీడియాలో కథనాలు వచ్చాకే అధికారులు స్పందించారు. అయితే అదే సమయంలో మిగిలిన గ్రామాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. భోజనం అందించడం నిలిపివేసినప్పుడు నిత్యావసర సరుకులు అందించాలని వరద బాధితులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్‌పి విస్తృత పర్యటనలు చేసి జారీ చేస్తున్న ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. ఉన్నతాధికారులు వరద బాధితుల సమస్యలపై మరింత దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు. లేకపోతే వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముందు పరిస్థితి ఏమిటనే ప్రశ్న అందరినీ వెంటాడుతోంది.

వీడని వరద భయం

గోదావరి వరద ఉధృతి మళ్లీ పెరుగుతోంది. భద్రాచలం వద్ద బుధవారం 45 అడుగులకు చేరిన నీటిమట్టం గురువారం సాయంత్రానికి మళ్లీ 49 అడుగులకు పెరిగింది. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. పోలవరం ఎగువ కాఫర్‌డ్యామ్ వద్ద నీటిమట్టం 33.100 మీటర్లకు చేరగా దిగువకు దాదాపు 11 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తగ్గినట్లే తగ్గి గోదావరి వరద పెరగడంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మళ్లీ హైటెన్షన్ మొదలైంది. ఇప్పటికే గొమ్ముగూడెం, రాపాకగొమ్మి, కౌండిన్యముక్తి, కొయిదా వంటి పలు గ్రామాలకు చెందిన ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరారు. రుద్రంకోట మాదిరిగా పలు గ్రామస్తులు కొండలపైకి వెళ్లి గుడారాలు వేసుకున్నారు. శుక్రవారం నాటికి భద్రాచలం వద్ద నీటిమట్టం 52 అడుగులకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. వరద ఉధృతి పెరిగి మరికొన్ని గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించాల్సిన దుస్థితి ఏర్పడనుంది. ఇప్పటికే పునరావాస కేంద్రాల్లోకి చేరిన వరద బాధితులను అధికార యంత్రాంగం సరిగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బియ్యంతోసహా ఏఒక్కటీ ఇవ్వలేదు



రవీంద్ర, రుద్రంకోట, వేలేరుపాడు మండలం

రుద్రంకోటలో దాదాపు 80 కుటుంబాలు కొండపైకి వెళ్లి ఉంటున్నాయి. ఇప్పటి వరకూ బియ్యం, కొవ్వొత్తులు, మస్కిటో క్వాయిల్స్, కందిపప్పు, ఆయిల్‌ప్యాకెట్ వంటి నిత్యావసర వస్తువులు ఏఒక్కటీ ఇవ్వలేదు. కూరగాయలు ఇచ్చినా సగానికిపైగా పనికిరాకుండాపోయాయి. 2022లో వరదలకు ఇచ్చిన టార్పలిన్లు కాకుండా చిన్నసైజు టార్పలిన్లు ఇవ్వడంతో గుడారాలు వేసుకునేందుకు సరిపోవడం లేదు. ఇప్పటి వరకూ జనరేటర్ ఏర్పాటు చేయలేదు. మా బాధలు పట్టించుకుని సాయం అందించాలని ఉన్నతాధికారులను కోరుతున్నాం.

మళ్లీ పెరుగుతున్న గోదావరి

- ఇంకా ముంపులోనే రహదారులు
- వారం రోజులుగా 19 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ఆందోళనలో జనం



వింజరం ముత్యాలంపాడు గ్రామాల మధ్య రహదారిపై వరద నీరు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

ఆరు రోజులుగా పెరుగుతూ వస్తున్న గోదావరి వరద తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరుగుతోంది. భద్రాచలంలో 52 అడుగులకు చేరిన గోదావరి వరద బుధవారం సాయంత్రానికి ఏడు అడుగుల మేర తగ్గి 45 అడుగులకు చేరుకున్న విషయం తెలిసిందే. దీంతో విలీన మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు ప్రాజెక్టులో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదలడంతో గోదావరికి వరద పెరుగుతూ గురువారం సాయంత్రానికి 49 అడుగులకు చేరడంతో మళ్లీ రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఇప్పటికే దాచారం-కుక్కునూరు, ముత్యాలంపాడు-వింజరం రహదారులపైకి వరద నీరు చేరడంతో ఆరు రోజులుగా 19 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో సీతారామనగరం-వేలేరు మధ్య రాకపోకలు ప్రారంభమయ్యాయి. మళ్లీ వరద పెరగడంతో రహదారిపైకి వరద నీరు చేరి నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. గోదావరికి వరద పెరుగుతుండటంతో కౌండిన్యముక్తి, ఎల్లప్పగూడెం, బెస్తగూడెం ఎస్‌సి కాలనీ, కుక్కునూరు రజక బజారు గ్రామాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు హెచ్చరించడంతో జనం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

పోలవరం: పోలవరంలో గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి నిలకడగా ఉంది. పోలవరంలో నీటిమట్టం 22.987 మీటర్లకు చేరుకుంది. వరద జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న 10,95,616 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇఇ మల్లికార్జునరావు, డిఇ మాధవరావు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నీటిమట్టం స్పిల్‌వే ఎగువన 33.100 మీటర్లు, స్పిల్‌వే దిగువన 24.700 మీటర్లు నమోదైనట్లు ఇఇలు తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలి

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి



కరుటూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి - వేలేరుపాడు

గోదావరి వరద మళ్లీ పెరుగుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. గురువారం వేలేరుపాడు మండలం కరుటూరు గ్రామంలో ప్రజలను కలిసి గోదావరి వరద ప్రమాద హెచ్చరికపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద మరింత పెరిగే అవకాశం ఉందని, జిల్లా అధికార యంత్రాంగానికి ప్రజలు సహకరించి పునరావాస కేంద్రాలకు రావాలని జెసి కోరారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేలేరుపాడు తహశీల్దార్ కార్యాలయంలో వరదల ప్రత్యేక అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. లోతట్టు గ్రామాల ప్రజలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పునరావాస కేంద్రంలో ప్రజలకు అవసరమైన త్రాగునీరు, నిత్యావసర వస్తువులు అందించాలన్నారు. పశువులకు ఆహారం అందించాలని , పునరావాస కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. సహాయ కేంద్రాలలో తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాల ఏర్పాటు తదితర అంశాలపై ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్.రాజు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ధర్నాలో నేతలు



ఏలూరులో ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం, సిపిఐ నేతలు



నూజివీడులో..

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ఎంపీల మద్దతుతోనే నేడు కేంద్ర ప్రభుత్వం నడుస్తున్నా మన రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్యాయమే చేస్తోందని సిపిఎం, సిపిఐ నేతలు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సిపిఐ ఏలూరు సమితి కార్యదర్శి యు.హేమశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేసేలా ఉందని విమర్శించారు. 2014 నుండి రాష్ట్రానికి ప్రత్యేక హోదా అమలు చేయకపోగా గడిచిన 10 సంవత్సరాల్లో విభజన చట్టం హామీలేవీ బిజెపి ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం బిజెపి నడుపుతుందంటే అది మన రాష్ట్ర ఎంపీల మద్దతుతోనేనని అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని బిజెపిపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల అమలుకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో బిజెపి రాష్ట్ర రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ప్రపంచబ్యాంకు తదితర సంస్థల నుండి అప్పు ఇప్పించడానికి సహకరిస్తామని మాత్రమే ప్రకటించిందని అన్నారు. పోలవరం ప్రాజెక్టు, వెనకబడిన జిల్లాలకు సహకరిస్తామని అన్నదే తప్ప వాటిలో నిధుల ఊసే లేదన్నారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ఏదో మేలు జరిగిపోయినట్లు ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం తరపున టిడిపి, జనసేన, బిజెపి హర్షం వ్యక్తం చేయటం సిగ్గుచేటన్నారు. ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.వి.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయించలేదన్నారు. ఉపాధి హామీకి భారీగా నిధుల కోత విధించారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.జగన్నాధరావు, జి.రవికిషోర్, వైఎస్.కనకారావు, జి.శారద, మీసాల సత్యం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వర్మా శ్యామల, మన్నవ యామిని తదితరులు పాల్గొన్నారు.

నూజివీడుటౌన్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక చినగాంధీబొమ్మ సెంటర్‌లో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి ఎటువంటి ప్రస్తావనా లేదన్నారు. తక్షణం బడ్జెట్ ప్రతిపాదనలు సవరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి జి.హనుమాన్, నేత దుర్గారావు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

జిల్లా ఎస్‌పి కె.శివప్రతాప్‌కిషోర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జిల్లాలో గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు జిల్లా ఎస్‌పి కొమ్మి శివప్రతాప్ కిషోర్ తెలిపారు. ఆయన గురువారం స్థానిక డిఎస్‌పి, సర్కిల్, రూరల్ పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు తెలిపారు. జిల్లాలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పేకాట, కోడిపందేలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. పలుపట్టణాల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. త్రిబుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపటంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఫోర్జరీ సంతకాలతో మోసాలకు గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆర్‌జెయుకెటిలో చదవడం పేద విద్యార్థులకు వరం

ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్



ఎస్‌పికి పూలబొకే అందజేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జెయుకెటిలో చదవడం పేద విద్యార్థులకు గొప్ప వరమని జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఆర్‌జెయుకెటి నూజివీడు క్యాంపస్ నందు విద్యార్థులకు నూజివీడు పోలీస్ విభాగం వారు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు పరిస్థితుల ప్రభావం, మన చుట్టుపక్కల ఉన్న సమాజం మీద అవగాహన కలిగి చదవాలన్నారు. విద్యార్థులు వారు చదివే చదువు, సంపాదించుకున్న జ్ఞానం అటు రాష్ట్రానికి, ఇటు దేశానికి ఉపయోగపడాలని సూచించారు. విద్యార్థులు అభివృద్ధి చెందుతున్న సాంకేతికత మీద పూర్తి ఫోకస్ చేసుకొని ఎటువంటి ఇండస్ట్రీలో స్కిల్స్ అవసరమో అవన్నీ ఇప్పటి నుంచే నేర్చుకోవాలన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థిగా అప్లికేషన్ డెవలప్మెంట్, వెబ్‌సైట్ డెవలప్మెంట్ లేదా ప్రొడక్ట్ డెవలప్మెంట్ మీద ఆలోచన పెడితే మంచి ఇంటర్న్‌షిప్‌ల ద్వారా మెరుగైన ఉపాధి సంపాధించగలుగుతారన్నారు. విద్యార్థులు పోలీస్ డిపార్ట్మెంట్‌తో కలిసి సామాజిక దురాచారాలను నిర్మూలించేందుకు సహాయపడాలన్నారు. ఇక్కడ చదివే చాలా మంది విద్యార్థులు గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చారు, కాబట్టి వీరికి సమాజాన్ని దగ్గరగా చూసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఇప్పుడున్న సొసైటీలో యూట్యూబ్, చాట్ జిపిటి లాంటి సొల్యూషన్స్ చాలా ఉన్నాయని, తమ సమస్యలను ఈ సాంకేతికతో కండక్ట్ చేయగలిగితే మీరు ఎంచుకున్న ప్రతి రంగంలోనూ రాణిస్తారని తెలిపారు. సామాజిక సమస్యలపై దృష్టి పెట్టాలని, చెడు వ్యసనాలకు, విషయాలకు అలవాటు పడకండన్నారు. అనంతరం ఆర్‌జెయుకెటి నూజివీడు నిర్దేశకులు ఆచార్య ఎం.చంద్రశేఖర్ ఎస్‌పిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ జి.లక్ష్మయ్య, నూజివీడు డివిజన్ సిఐ, ఆర్‌జెయుకెటి నూజివీడు డీన్ అకాడమిక్ రత్నాకర్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లు, నూజివీడు సబ్ డివిజన్ సబ్ ఇన్స్‌పెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల, విత్తనాల ధరల బోర్డులు ఏర్పాటు చేయాలి

ఎడిఎ విద్యాసాగర్



వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

ప్రజాశక్తి - చాట్రాయి

ఎరువులు, విత్తనాల ధరల బోర్డులు ఏర్పాటు చేయాలని, బిల్లు రసీదులు రైతులకు ఇవ్వాలని, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అమ్మాలని నూజివీడు డివిజనల్ వ్యవసాయ సహాయకులు ఎడిఎ విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని వ్యవసాయానికి సంబంధించిన ఎరువులు, విత్తనాల డీలర్లకు గురువారం రైతు భరోసా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డివిజనల్ వ్యవసాయ సహాయకులు ఎడిఎ విద్యాసాగర్ పాల్గొని మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు అమ్మిన బిల్లు రసీదులు ఇవ్వకపోయినా క్రమశిక్షణ చర్యల్లో భాగంగా చట్టపరంగా అలాంటి డీలర్లపై చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా బిల్లు రసీదు అడిగి తీసుకోవాలని రైతులకు సూచించారు. భూసార పరీక్ష ఆధారిత ఎరువుల గురించి, ఉద్యాన శాఖ ద్వారా రైతులకు ఉపయోగపడే పథకాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి బి.శివశంకర్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ఆర్.హేమ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అదనపు వర్జీనియా పొగాకు అమ్మకానికి అనుమతి

ఇది రైతుల విజయం : ఎంపీ మహేష్ కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అదనంగా పండించిన పొగాకును అమ్ముకోవటానికి రైతులకు, అధీకృత వేలం ప్లాట్ ఫారాలపై కొనుగోలు చేయటానికి వ్యాపారస్థులకు అనుమతినిస్తూ కేంద్ర ప్రభుత్వ సెక్రటరీ, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ సునిల్ బర్త్వాల్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఇది రైతుల విజయమని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రకటన ద్వారా తెలియజేశారు. అనంతరం సెక్రటరీ, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ సునిల్ బర్త్వాల్‌కి రైతుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకు ముందు పొగాకు రైతుల సమస్యలను కేంద్ర మంత్రుల దృష్టికి ఈనెల 3వ తేదీన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తీసుకెళ్లారు. రైతులకు మేలు చేసే జిఒను విడుదల కావడం పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 10వ తేదీన దేవరపల్లిలో జరిగిన పొగాకు టిఐఐ రైతు అవార్డుల వేడుకలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ దృష్టికి పొగాకు రైతులు మిచాంగ్ తుఫాన్ వల్ల పంట కోల్పోయి తిరిగి ప్రభుత్వం అనుమతించిన దాని కంటే ఎక్కువ విస్తీర్ణంలో పొగాకు పండించామని, అదనంగా పండించిన పంటకు ఫెనాల్టీ లేకుండా కొనుగోలు చేయాలని ఎంపీని రైతులు కోరారు. వెంటనే స్పందించిన పుట్టా మహేష్ కుమార్ సంబంధిత మంత్రి పీయుష్ గోయల్ దృష్టికి తీసుకువెళ్లి ఎటువంటి అపరాధ రుసుం లేకుండా అధీకృత ప్లాట్ ఫారాలపై పొగాకు అమ్ముకోవటానికి అనుమతులు కోరిన వెంటనే స్పందించిన కేంద్ర ప్రభుత్వం జిఒ విడుదల చేశారని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలియజేశారు. ఒక లైసెన్స్ ఉన్న రైతు 35 క్వింటాల్ పొగాకు పండించుకునే కోట కూడా 41.25 క్వింటాలకు పెంచారని ఆయన తెలియజేశారు. త్వరలోనే పామాయిల్ రైతుల సమస్యలు కూడా పరిష్కరిస్తానని ఎంపీ తెలిపారు.

వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ఏలూరు అర్బన్: గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 25 గ్రామాలకుపైగా వరద తాకిడికి గురయ్యాయని సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అన్నారు. వరద బాధితుల సహాయార్థం సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ఏలూరు నగరంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం అక్కడి ప్రజానీకం కొండలమీద, గుట్టల మీద, ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాల్లో తలదాచుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజల అవసరాల కోసం నిర్మితమవుతున్న పోలవరం ప్రాజెక్టు వల్ల ఆ చుట్టుపక్కల ప్రజానీకం ప్రతి యేటా ఈ వరద బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రాజెక్టు నిర్మాణం గురించి మాట్లాడుతున్నాయి తప్పితే ఆ ప్రాజెక్టు నిర్మాణం వల్ల సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం మాత్రం చెల్లించడం లేదని విమర్శించారు. పరిహారం ఇవ్వకపోవడం వల్ల ప్రజలు అక్కడే ఉంటున్నారని, దాంతో ప్రతి ఏటా వరద బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కాబట్టి ఇప్పటికైనా పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల పరిహారం సత్వరమే అందజేసి ముంపు మండలాల ప్రజానికాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత వారం రోజుల పాటు కురిసిన వర్షాలకు వరద బాధితుల సహాయార్థం సిపిఎం ఏలూరు పవర్ పేట, ఆర్ఆర్ పేట ప్రాంతాల్లో మార్కెట్ నందు విరాళాల సేకరించగా రూ.6,750 వచ్చిందని తెలిపారు. ఈ మొత్తాన్ని పార్టీ జిల్లా కమిటీ ద్వారా నిర్వాసిత గ్రామాలకు నిత్యవసర సరుకుల పంపిణీ నిమిత్తం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.జగన్నాథరావు, వి.సాయి బాబు, ఎం.ఇసాక్, జె.గోపి, జి.శారద, ఎం.సత్యనారాయణ, పి.దుర్గాప్రసాద్, ఠాగూర్, లెనిన్, ఏసుబాబు, అల్లం వెంకటేశ్వరరావు, బి.త్రినాథ్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్

ఏలూరు అర్బన్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ గురువారం స్థానిక శనివారపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహంలో బాలలకు అందిస్తున్న సౌకర్యాలపైన, పరిసరాల శుభ్రత, పిల్లల భద్రత, వైద్య సదుపాయాలపైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి తగు సూచనలు చేశారు. బాలురు తమకు విద్యాబోధనకు సరైన ఉపాధ్యాయల సౌకర్యం లేదని ఫిర్యాదు చేయగా, సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ఉపాధ్యాయుల సౌకర్యాల్ని కల్పించవలసిందిగా జిల్లా విద్యాశాఖ అధికారికి, ఇతర ఉన్నతాధికారులకు వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. దీనిపైన సంబంధిత అధికారులను సంప్రదించి తక్షణం ఉపాధ్యాయుల సౌకర్యాన్ని విద్యార్థులకు కల్పించి, విద్యా సంవత్సరం వృధా కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సూపరింటెండెంట్ పి.శ్రీవల్లి పాల్గొన్నారు.

ముంపులోనే వరినాట్లు.. ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి - పోలవరం

మండల కేంద్రంలో తహశీల్దారు కార్యాలయానికి వెళ్లే రోడ్డు మార్గానికి ఇరువైపులా ఉన్న వరినాట్లలో కొండవాగుల జలాలు నిండి ఉండడంతో వరద నీటిలో మునిగి ఉన్నాయి. గోదావరి నీటిమట్టం తగ్గకపోవడం వల్ల కడమ్మ స్లూయిజ్ గేట్లకు గోదావరి వరద జలాలు తన్నిపెట్టి ఉండడం వల్ల గేట్లు పూర్తిగా మూసుకుపోయి కొండవాగుల జలాలతో తహశీల్దార్ కార్యాలయంకు వెళ్లే దారిలో ఇరువైపుల ఉన్న సుమారు రెండు వేల ఎకరాల పొలాల్లో వరినాట్లు నీటమునిగాయి. తమను ఆదుకోవాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు: ఈనెల 26వ తేదీ శుక్రవారం ఏలూరు 1వ పట్టణంలో గల కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల దగ్గరలో గల చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమత్తుల నిమిత్తం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపదల చేయబడునని ఏపిఈపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెబివి నటరాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమయంలో కోటదిబ్బ సబ్‌స్టేషన్ పరిధి లో గల వైభవ్ పోర్ట్ ఏరియా, అగ్రహారం, వెన్నవల్లివారిపేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, ఉంబాడి పేట, భావిశెట్టివారి నల్లదిబ్బ, కెనాల్ రోడ్ వరకు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునన్నారు. వినియోగదారులు సహకరించవలసిందిగా కోరారు.

మండలంలోని డి3 - ఏలూరు సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కేవీ శాంతినగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ కెనెన్‌కర్ తోట ఫీడర్‌కు చెట్టు కొమ్మల తొలగింపు, లైన్లకు మరమ్మతు చేయుటకు గాను ఈనెల 26వ తేదీ(శుక్రవారం) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జెవిఆర్ నగర్, కెనెన్‌కర్ తోట, విద్యానగర్ సాయిబాబా టెంపుల్, శతవాహన నగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఏపిఈపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెబివి నటరాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా ఆయన కోరారు.

కామవరపుకోట: నేడు విద్యుత్తు సరఫరా నిలుపుదలను వినియోగదారులు గమనించాలని జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ చెట్టు కొమ్మలు నరికే నిమిత్తం మండలంలోని 33/11 కేవీ జలపాలగూడెం విద్యుత్ ఉప కేంద్రంలోని గ్రామాలైన ఆంకాలంపాడు, జలపవారి గూడెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగునని తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మండవల్లి: కంటి సమస్యలను పరిష్కరించుకునే విధంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని సర్పంచ్ మెండి దుర్గ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక నాగేంద్ర స్వామి కళ్యాణ మండపంలో శంకర్ నేత్రాలయం వైద్యులచే శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కంప్యూటర్‌పై కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కంటి పరీక్షల అనంతరం శస్త్ర చికిత్సలు అవసరమైనా వారికి ఉచితంగానే చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని కంటి సమస్యలు కలిగిన వారు సద్వినియోగం చేసుకొని పరిష్కరించుకోవాలని ఆమె కోరారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పిడిఎస్‌యు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గురువారం ఆందోళన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా ఏలూరు కోట దిబ్బలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు, సరిపడా తరగతి గదులు లేక బయట చెట్ల కింద క్లాసులు జరపాల్సిన పరిస్థితి ఉందని, విద్యార్థుల ఆందోళనతో తరగతి గదులు నిర్మిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ నేటికీ పనులు ప్రారంభించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి శాశ్వత భవనాలను కల్పించాలని కోరారు. ప్రధానంగా రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో మౌళిక సదుపాయాలు కూడా లేక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. ఎన్నో ఏళ్లగా రెగ్యులర్ అధ్యాపకుల నియామకం లేక ఔట్‌సోర్సింగ్, గెస్ట్, కాంట్రాక్టు లెక్చరర్లతో కాలేజీలు నడుస్తున్నాయన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ కాలేజీల ఫీజుల ఆగడాలను దోచుకుంటున్నా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, కనుక రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజా, మధు, ప్రశాంత్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలుకార్డులివ్వాలని వినతి

ప్రజాశక్తి - ముసునూరు

కౌలుదారులకు ఉన్న ప్రతి కౌలు రైతుకు పంట సాగు చేసుకునేందుకుగాను బ్యాంకు రుణం అందజేయాలని చెక్కపల్లి బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ కుమార్‌కు మండల వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్ ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. రైతులు తల్లి భోయిన రాధిక సత్యనారాయణ, కాటపల్లి సత్యనారాయణ, సురేంద్ర పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఐటిఆర్ఇ ఫైలింగ్

ప్రజాశక్తి - ముదినేపల్లి

యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయులకు గురువారం ఐటిఆర్ ఇ ఫైలింగ్ చేయడం జరిగిందని యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సాయి లక్ష్మీ, దుర్గ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 40 మందికి ఐటిఆర్ఇ ఫైలింగ్ పూర్తి చేసామన్నారు.

అనుశ్రీకి అభినందన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జాతీయస్థాయిలో ప్రేరణకు ఎంపికైన అనుశ్రీకి ఎంపీ పుట్టా మహేష్ అభినందనలు తెలిపారు. జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమం ప్రేరణకు ఎంపికైన ఏలూరుకు చెందిన అనుశ్రీని ఆయన ప్రత్యేక ప్రకటన ద్వారా అభినందించారు.

రహదారి నియమాలు పాటించాలి : ఎస్ఐ

కామవరపుకోట: వాహనదారులు తప్పకుండా రహదారి భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని తడికలపూడి ఎస్ఐ జయబాబు అన్నారు. గురువారం స్థానిక సొసైటీ పెట్రోల్ బంకు ఎదురుగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనా దారులకు అతి హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు.

బడ్జెట్‌లో వ్యవసాయ కార్మికులకు అన్యాయం

వ్యకాస జిల్లా కార్యదర్శి వసంతరావు

జంగారెడ్డిగూడెం టౌన్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందని, ఆశించిన ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందని, ఉపాధి అవకాశం క్రమించే వ్యవసాయ కార్మికులకు పూసే లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు విమర్శించారు. గురువారం జంగారెడ్డిగూడెం సిపిఐ కార్యాలయంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టం లేదన్నారు, ఉపాధిహామీ చట్టానికి సంబంధించిన నిధులు కుదింపులపై కాని బడ్జెట్లో లేదని ఆయన విమర్శించారు.

పాపాదాస్ మృతికి సంతాపం

కామవరపుకోట: బుట్టాయిగూడెంకు చెందిన సిపిఐ సీనియర్ నాయకులు పాముల పాపా దాస్ మృతికి సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టివిఎస్ రాజు, సహాయ కార్యదర్శి కంకిపాడు బుచ్చిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జి.సత్యనారాయణ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన విశేష సేవలు అందించారని, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

డివైఎఫ్ఐ రాష్ట్ర శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఈనెల 27, 28, 29, 30 తేదీలలో జరుగుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర క్లాసులను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ అన్నారు. గురువారం జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు ఎం.వెంకట్రాజు అధ్యక్షత వహించగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్య కిరణ్ మాట్లాడుతూ నిరంతరం నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్న డివైఎఫ్ఐ రాష్ట్ర క్లాసులు సందర్భం జిల్లాలో జరుగుతున్నాయని, ఈ క్లాసులకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డివైఎఫ్ఐ సంఘం ముఖ్య నాయకులు హాజరవుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎస్.రాజేష్, నాని, యు.గణేష్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

ఏలూరు సిటీ : స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా ఏలూరు ఎంఎల్ఏ బడేటి రాధాకృష్ణయ్య(చంటి) ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం వారితో 28వ డివిజన్‌లోని ద్వారక నగర్, బిడి కాలనీ, వాణి నగర్ తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిల్వనీటిలో ఆయిల్ బాల్స్ వేయడం జరిగిందని మున్సిపల్ హెల్త్ ఆఫీసరు మాలతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ తంగిరాల సురేష్, మలేరియా ఇన్స్‌పెక్టర్ దత్తి వేణుగోపాల్ స్వామి, మలేరియా సూపర్వైజర్ పాల్గొన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలి

టి.నరసాపురం: కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలని మండల వ్యవసాయ అధికారి బి.సుమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులతో ప్రభుత్వం ద్వారా అందించే పలు పథకాలు, పంటల భీమా పొందవచ్చునన్నారు. మండలంలో 3,495 మంది కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులు పొందాల్సి ఉండగా నేటి వరకూ 1,500 మంది గుర్తింపు కార్డులు పొందారని ఆమె తెలిపారు. మిగిలిన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి సూచించారు. ఎంపిక చేయబడిన రైతులు పొలాల్లో మట్టి నమూనాల సేకరణకు సహకరించాలని ఆమె కోరారు. మండలంలో 810 మట్టి నమూనాల సేకరణకు గాను సుమారు 600 మట్టి నమూనాలు సేకరించినట్లు ఆమె తెలిపారు.

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 2,832 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం: పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 2,832 క్యూసెక్కుల గోదావరి జలాలు పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిఇ పెద్దిరాజు గురువారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 22.987 మీటర్లు నమోదయ్యిందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 8 పంపులు 8 మోటార్లతో నీటి పంపిణీ చేస్తున్నట్లు డిఇ తెలిపారు. కృష్ణా డెల్టా, ఏలూరు, ఉమ్మడి పశ్చిమ డెల్టాల సాగునీటి అవసరాల నేపథ్యంలో నీటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.22 కోట్లు మంజూరు

జీలుగుమిల్లి: పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి రూ.22 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఎంఎల్ఏ చిర్రి బాలరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర పంచాయతీ రాజ్ డైరెక్టర్ కృష్ణతేజను ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పంచాయతీల అభివృద్ధికి రూ.22 కోట్ల నిధులను కేటాయించినట్లు ఆయన తెలిపారు.

పాముకాటుతో ఆరుగురికి అస్వస్థత

పోలవరం: పోలవరం మండలంలో గత మూడు రోజులలో ఆరు పాముకాటు కేసులు నమోదైనట్లు వైద్యాధికారి కృష్ణంరాజు గురువారం తెలిపారు. ఎల్లండిపేట గ్రామానికి చెందిన ఎస్.అమ్మిరాజు, గూటాల గ్రామానికి చెందిన తోటకృష్ణ, పాతపట్టిసీమ గ్రామానికి చెందిన జి.రాజబాబు, కృష్ణారావుపేట గ్రామానికి చెందిన పొట్నూరి నాగేశ్వరరావు, రామయ్యపేట గ్రామానికి చెందిన మేడూరి లక్ష్మణరావు, కొతపట్టిసీమ గ్రామానికి చెందిన సిద్దంశెట్టి సత్యన్నారాయణ పొడజాతికి చెందిన పాము కాటుకి గురైనట్లు తెలిపారు. పాముకాటుకి గురైన వారంతా రైతులని వర్షాల సీజను కావడం వల్ల ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బోదెలో పూడిక తొలగింపు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం రూరల్

మెరక గూడెం గ్రామంలో పంటబోదెలు పూడిక తీయకపోవడంతో ఊరి మధ్యలో ఉన్న బోదే నీళ్లు నిండిపోయి ఊరి మధ్యలో నీళ్లు వచ్చేస్తున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో గురువారం గ్రామస్తులు ఈ సమస్యని పరిష్కరించారు. సోదేం బొజ్జియ్య, మాజీ సర్పంచి కురసం వెంకటేష్, కురసం రాముడు బోదే మధ్యలో దిగి పూడిక తీసి సమస్యని పరిష్కరించారు.

బాధిత మహిళకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని ఆరుగొలను పేట గ్రామానికి చెందిన అంబోజి రమేష్ గత నాలుగు సంవత్సరాల క్రితం తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తూ కింద పడి మరణించారు. అప్పటికే రమేష్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ధనలక్ష్మి ఇద్దరు పిల్లలతో తన పుట్టిల్లు అయిన నూజివీడు మండలం వెంకటాయపాలెం గ్రామంలో కూలీ పనులు చేస్తూ పిల్లల్ని చదివించుకుంటూ జీవిస్తుంది. ఉండటానికి కూడా సరైన నివాసం లేక ఇబ్బందులు పడుతూ కటిక పేదరికం అనుభవిస్తుంది. విషయం తెలుసుకున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల అధ్యక్షులు లింగోజు సరిత, యువజన సంఘం మండల నాయకులు లింకోజు వంశీ, సిపిఎం సభ్యులు కొమ్ము ఆనందం గురువారం దాతల సహకారంతో రూ.16,500 వెంకటాయపాలెం వెళ్లి ధనలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వాటిని తట్టుకొని నిలబడి పిల్లలను మంచి చైతన్యవంతులుగా తీర్చిదిద్ది, ఉన్నత విద్యను నేర్పించాలని, అందుకు ప్రభుత్వం కూడా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నిరుపేదలకు అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ఆమెకు ధైర్యాన్ని ఇచ్చారు

కేసులు ఎత్తివేయడం శుభపరిణామం

ఎపి జెఎసి అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్ఎస్ హరినాథ్

ఏలూరు అర్బన్: గత 5 సంవత్సరాల కాలంలో ఉద్యోగ ఉపాధ్యాయులపై అక్రమంగా పెట్టిన సుమారు 4 వేల కేసులను సమీక్షించి ఆ కేసులు ఎత్తివేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం శుభపరిణామమని ఎపి జెఎసి అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్ఎస్ హరినాథ్ ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తన పాదయాత్రలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం లోపే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేస్తానని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఆందోళన చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులపై గత ఐదు సంవత్సరాలుగా అక్రమంగా కేసులు పెట్టారు. వారందర్నీ వాయిదాలకు కోర్టుల చుట్టూ తిప్పుతూ తీవ్రంగా అనేక ఇబ్బందులు పెడుతున్న సంగతి అందరికి తెలిసిందే. ఈమేరకు సిఎం ఉద్యోగ ఉపాధ్యాయులపై పెట్టిన కేసులను పరిశీలించి ఎత్తివేస్తామని ప్రకటించడం శుభ పరిణామం అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదములు తెలియజేశారు.

పలుచోట్ల 'శిక్ష సప్తాహ'

ప్రజాశక్తి - మండవల్లి



మండవల్లిలో విద్యార్థుల సాంస్కృతిక రూపాలు

భిన్నత్వంలో ఏకత్వమే ప్రధాన లక్ష్యంగా భారతీయ సంస్కృతిని విద్యార్థులు అందరికీ తెలియజేసే విధంగా కేంద్ర ప్రభుత్వం దేశమంతటా జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చిందని ప్రధానోపాధ్యాయురాలు ఎస్.జయశ్రీ స్పష్టం చేశారు. శిక్ష సప్తాహ విద్యా వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు గురువారం అయ్యావారి రుద్రవరం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు పలు రకాల వేషధారణలో కనువిందు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని దేశమంతటా తీసుకువచ్చిందని తెలిపారు. ఈ విధానాన్ని ప్రవేశపెట్టి నేటికి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకోవడం జరిగిందని, భిన్నత్వంలో ఏకత్వాన్ని విద్యార్థుల్లో నింపడం, అన్ని భాషలను గౌరవించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడం జాతీయ విద్యా విధానం లక్ష్యమన్నారు. విద్యలో కళా విద్యని, సాంస్కృతిక విద్యని అంతర్భాగం చేయాలనేది జాతీయ విద్యా విధానం ముఖ్య లక్ష్యమని తెలిపారు. అనంతరం విద్యార్థులు అలంకరించిన పలు వేషధారణలు తల్లిదండ్రులను, గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చిరిగిరి పిచ్చోడు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో శిక్ష సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టబడి నాల్గవ వార్షికోత్సవం జరుపుకుంటున్న విద్యా వ్యవస్థలో భాగంగా గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగవ రోజు సాంస్కృతిక కార్యక్రమాలు చేయించడం జరిగిందని, జాతీయ నాయకులు, స్వాతంత్ర సమరయోధుల వేషధారణతో విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకటరావు తెలిపారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే బేధం లేకుండా ఏక్ భారత్, శ్రేష్ట భారత్ అనే నినాదంతో భారతీయులందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు.

ముసునూరు: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సంస్కృత కార్యక్రమాలు నిర్వహించినట్లు రమణక్కపేట ప్రధానోపాధ్యాయులు పివిఎస్ రామకృష్ణారావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని రమణక్కపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్, సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రమాదాల బారిన నూజివీడు డిపో బస్సులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



ప్రమాదానికి గురైన బస్సు

నూజివీడు డిపోకు చెందిన ప్రయివేట్ హయ్యర్ ఇంద్ర బస్సు నూజివీడు నుంచి బిహెచ్ఇఎల్ వెళుతుండగా బుధవారం రాత్రి లాస్ట్ టోల్‌గేట్ పంతంగి వద్ద వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణనష్టం జరగలేదు. నూజివీడు డిపో నుంచి హైదరాబాద్ వెళుతున్న డిపో బస్సులు గాని, ప్రయివేట్ హయ్యర్ బస్సులు గాని వరుస యాక్సిడెంట్లకు గురి అవ్వడంతో ప్రయాణికులు హైదరాబాద్ వెళ్లడానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికులు తీవ్ర భయబ్రాంతులకు గురవుతున్నారు. వీటిపై నూజివీడు డిపో మేనేజర్ పవన్ కుమార్‌ని వివరణ అడగగా డ్రైవర్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకొని శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు.

మహిళా సాధికారత, చట్టాలపై అవగాహన

ద్వారకా తిరుమల: మండలంలోని గుండుగొలను కుంట గ్రామంలో అంగన్వాడీ సెంటర్లో 100 డేస్ స్పెషల్ క్యాంపెయిన్, మహిళా సాధికారికత, భేటి బచావో భేటి పడావో పథకం గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మేరీ మాట్లాడుతూ గృహహింస చట్టం, వాళ్లకు చట్టపరంగా కల్పించే రక్షణ, న్యాయస్థానం విచారణ విధానం, అప్పీల్‌పై అవగాహన కల్పించారు. జిఎంఎస్ కె.సుజన మాట్లాడుతూ మహిళా సాధికారకత గురించి ఏ దేశంలోనైనా స్త్రీ ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వావలంభన కలిగి ఉంటుందో ఆ దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని, నైపుణ్యం పెంపొందించుకోవాలని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరంలో మందుల పంపిణీ

నూజివీడు టౌన్ : శ్రీసత్యసాయి సేవా సమితి నూజివీడు వారి ఆధ్వర్యంలో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా ఆయుష్ హాస్పిటల్స్ యాజమాన్యం డాక్టర్ గోపాలకృష్ణ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై.రమేష్‌బాబు, డాక్టర్ పిఎస్.శ్రీనివాస్ చోదరి సహాయ సహకారాలతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రధాన పరిపాలనాధికారి ఎం.జయలక్ష్మి పర్యవేక్షణలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 100 మందికిపైగా వైద్య సహాయం అందించారు. హెపటైటిస్ స్క్రీనింగ్ పరీక్ష, ఇసిజి, బిపి, షుగర్ పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

'మా భూములు కాపాడాలి'

చింతలపూడి: మా భూములను కాపాడండి, మా భూములను మాకు ఇప్పించండని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ కోరారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం లింగగూడెం రెవెన్యూ పరిధిలో 107 ఎకరాల గయ్యాల భూమి 1990 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకత్వంలో నాలుగు గ్రామాల ప్రజలు భూ పోరాటాల ద్వారా ఎన్నో ఇబ్బందులు పడి సాధించడం జరిగిందని తెలిపారు. ఈ మధ్యకాలంలో అదే గ్రామంలో కొంతమంది భూస్వాముల పెత్తందారులు మాటల నమ్మి కుట్రల చేస్తూ నిరుపేదలు సాగు చేసుకుంటున్న భూములను అమ్మాలని దురుద్దేశంతో అమాయక నాయకపోడు పేద ప్రజలను ఆసరాగా చేసుకుని మాయ మాటలు చెప్పి, కొంత మొత్తం డబ్బులు ఆశ చూపి కుట్రలు చేస్తున్నారని సంఘం దృష్టికి వచ్చిందన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుని తమ భూములకు హక్కులు కల్పించి, న్యాయం చేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులను డిమాండ్ చేసినట్లు తెలిపారు.

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.2,41,72,018

ద్వారకాతిరుమల: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీలు గురువారం ఉదయం ప్రమోద మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ దేవస్థాన కార్యనిర్వాహణాధికారి పర్యవేక్షణలో లెక్కింపు జరిపారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా స్వామి వారికి గడచిన 28 రోజులకు గాను రూ.2,41,72,018ల ఆదాయం వచ్చింది. అలానే భక్తుల కానుకల రూపేణ 401 గ్రాముల బంగారం, 6 కేజీల 222 గ్రాముల వెండి, పాత రూ.500(12నోట్లు), రూ.1,000(1 నోట్లు), రూ.2,000(82 నోట్లు) పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు తెలిపారు. కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు తెలిపారు.

విద్యార్థిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఏలూరు స్పోర్ట్స్ : తోటి విద్యార్థిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో పోలీసులు ఆ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు నగరంలోని సెయింట్ జేవియర్ బాయ్స్ కాన్వెంట్ అటాచ్డ్ హాస్టల్‌లో గుడివాకులంక ప్రాంతానికి చెందిన సుధీర్‌బాబు ఏడో తరగతి చదువుతున్నాడు. భీమవరం చెరుకువాడ ప్రాంతానికి చెందిన విజయ్ కూడా ఏడవ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో విజయ్ తల్లి విదేశాలకు వెళ్లి రావడంతో గత కొద్ది రోజుల క్రితం విజయ్ ఇంటికి వెళ్లి తల్లిని చూసి మరలా తిరిగి రెండు రోజుల క్రితం హాస్టల్‌కు తిరిగి వచ్చాడు. తాను వచ్చేటప్పుడు ఒక పెట్రోల్ బాటిల్ నిండా పెట్రోల్‌ను తీసుకుని వచ్చాడు. దీనికి గల కారణాలు ఇంకా తెలియ రాలేదు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. సుధీర్ బాబుకు శరీరంలో ఎడమ భాగంలో తీవ్రంగా కాలింది. ప్రస్తుతం సుధీర్ చికిత్స పొందుతున్నాడు. సుధీర్ తల్లిదండ్రులు బుధవారం రాత్రి మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట కొంతసేపు ఆందోళన చేశారు. ఈ ఘటనపై మూడో పట్టణ ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.